ఆషాఢమాస బోనాల జాతర షురూ..!

-జూలై 19న గోల్కొండ అమ్మవారికి తొలి బోనం
-ఆగస్టు 2న ఉజ్జయిని మహంకాళి బోనాలు
-10న లాల్‌దర్వాజా సింహవాహిని,నగరవ్యాప్తంగా సంబురాలు

హైదరాబాద్, జూన్ 16 ప్రభాతవార్త

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలకు భాగ్యనగరం ముస్తాబవుతోంది. వచ్చే నెల 19వ తేదీన గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ఈ చారిత్రాత్మక ఉత్సవాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. దాదాపు నెల రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలు ఆగస్టు 10వ తేదీ వరకు హైదరాబాద్ మహానగరంలో అంగరంగ వైభవంగా కొనసాగుతాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు.

గోల్కొండ కోటలో వచ్చేనెల 19న ఘటాల ఊరేగింపు

ఆషాఢ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని జూలై 19న గోల్కొండ కోటలో జగదాంబ అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, తొలి బోనం సమర్పిస్తారు. అదే రోజున నగరంలోని పలు ప్రధాన ఆలయాల్లో ఘటాల ఊరేగింపు కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించనున్నారు. నాటి నుంచి ప్రతి ఆది, గురువారాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణలు ఉంటాయి.

ఆగస్టు 2న ఉజ్జయిని మహంకాళి బోనాలు...

అత్యంత కీలకమైన ఘట్టాలు ఆగస్టు మొదటి వారంలో జరగనున్నాయి. ఆగస్టు 2 ఆదివారం లష్కర్ (సికింద్రాబాద్) ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలను సమర్పిస్తారు. జాతర మరుసటి రోజైన ఆగస్టు 3వ తేదీ సోమవారం ఉదయం 8:30 గంటలకు భవిష్యవాణిని వినిపించే ప్రసిద్ధ రంగం కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత ఉదయం 10:30 గంటల సమయంలో అత్యంత కోలాహలంగా అమ్మవారి గజవాహన ఊరేగింపు మహోత్సవాన్ని జరుపుతారు. ఆగస్టు 10న లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారు, పాతబస్తీలోని ఉమ్మడి దేవాలయాలతోపాటు నగర వ్యాప్తంగా బోనాల ఉత్సవాలతో ముగుస్తుంది. ఉమ్మడి దేవాలయాల ఘటాల సామూహిక ఊరేగింపు. గజరాజుపై అమ్మవారి శోభాయాత్రతో ఈ ఏడాది ఆషాఢ బోనాల జాతర ముగియనుంది. బోనాల పండుగను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు ఏర్పాటు చేస్తోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ. ఎంఎంసి, సిఎంసి,జలమండలి, పోలీస్, విద్యుత్ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు, భారీ బందోబస్తును కల్పించనున్నారు.



హైదరాబాద్ వార్త

స్కూల్ ఆటోలు, వ్యాన్‌లు భద్రమేనా?

-ఆర్టీఏ నిబంధనలు పాటించని యజమానులు
-నలుగురు ఎక్కాల్సిన చోట ..10నుంచి 12మంది
-ఆటోలు,మినీవ్యాన్‌లల్లో కిక్కిరిసిపోతున్న విద్యార్థులు
-కాలనీలు, రోడ్లపై అతివేగంతో ప్రయాణం
-ఓవర్‌లోడ్‌తో ప్రమాదాల బారిన పడే అవకాశం

హైదరాబాద్,జూన్ 16,ప్రభాతవార్త:

స్కూలు విద్యార్థులకు తీసుకెళ్లే బస్సులు భద్రమేనా? అనే సందేహంఅందరిలోనూ కలుగుతున్నది. ఆటోలు, ప్రైవేట్ వ్యాన్లు సైతం పెను ప్రమాదంగా మారుతున్నాయి. ఓనర్లు కొద్దిపాటి లాభం కోసం సామర్థ్యానికి మించి ఊపిరి ఆడనంతగా విద్యార్థులను కుక్కి మరీ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆటో వెనక భాగం, డ్రైవర్ సీటుకు ఇరువైపులా పిల్లలను కూర్చోబెట్టి, స్కూల్ బ్యాగులను బయటకు వేలాడదీస్తూ ప్రమాదకరంగా నడుపుతున్నారు. నలుగురు లేదా ఐదారుగురు ఎక్కాల్సిన ఆటోలో కనీసం 10 మందికి పైగా తీసుకెళ్తున్నారు. చిన్నపొరపాటు లేదా ప్రమాదం జరిగినా పసిప్రాణాలు గాల్లో కలసిపోయే ప్రమాదం ఉంది. ఈనెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న సందర్భంగా రవాణా శాఖ రంగంలోకి దిగి నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థల వాహనాలపై చర్యలకు రవాణా అధికారులు సిద్ధమవుతున్నారు. జూన్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. ఈ తనిఖీల్లో వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్నెస్, పర్మిట్, బీమా, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్లు ఉండాలి. డ్రైవర్లకు సరైన డ్రైవింగ్ లైసెన్స్, తగిన అనుభవం ఉండాలి. విద్యార్థుల భద్రత కోసం అటెండర్లు నియమించాలి. వాహనంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్ని ప్రమాద నివారణ ఏర్పాట్లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ వంటి భద్రతా సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలి. సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదు.

తల్లిదండ్రుల తప్పు కాదా ..?

నగరంలోని వివిధ పాఠశాలల్లో ఫీజులు పెద్ద మొత్తం ఉంటడంతో తల్లిండ్రులు స్కూల్ బస్సులకు వేలకువేలు పోసి చదవించుకోవడం కష్టతరం అవుతోంది. దీంతో వారు ఆటోలను ఆశ్రయిస్తుండటంతో ఆటో డ్రైవర్లు పరిమితికి మించి పిల్లలను ఎక్కించుకుని తరచు ప్రమాదాల బారినపడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారుల జీవితాలతో ఆడుకుంటున్నారు. స్కూల్ బస్సులకు ఎన్నో నియమ, నిబంధనలు పెట్టిన రవాణా శాఖ అధికారులు వీటి విషయంలో అంతకు పట్టించు కోవడం లేదు. ఆటోలో ఆరుగురి మాత్రమే అంటున్న ట్రాఫిక్ అధికారులు అధిక సంఖ్యలో పిల్లలను తీసుకు వెళ్తున్నా వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అంతే కాదు ఆరుగురు విద్యార్థులను మాత్రమే తరలిస్తున్న ఆటోలు ఏమేరకు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయి? ఆటో డ్రైవర్లు తీసుకునే రక్షణ చర్యలు ఏమిటి అనే అంశాలను వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. చిన్నారులను స్కూల్‌కు తీసుకు వెళ్ళే ఆటోలకు సైడ్ డోర్స్, సేఫ్టీమెష్‌లు మచ్చుకైనా కనిపించవు వీటిలో కొన్ని ఆటోలు ఫిట్‌నెస్‌కు ఆమడదూరంలో ఉంటున్నాయి. అంతే కాదు కొంత మంది ఆటో డ్రైర్లు రూ.10 నుంచి 15 వేలకు కాలం చెల్లిన ఆటోలు కొనుగోలు చేసి వాటిని కేవలం స్కూల్ ఆటోలుగా తిప్పుతున్నారు. వీటి నుంచి వచ్చే కాలుష్యం కారణంగా ఇటు ఆటోలో ఉన్న విద్యార్థులు, ఆటు రోడ్ల మీద పోయే ఇతర వాహనదారులు, పాదచారులు కాలుష్యం బారినపడుతున్నారు. అలాగే స్కూళ్ళకు పిల్లలను తీసుకువచ్చే ఆటోలకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత విద్యాసంస్థలు సైతం పట్టించుకోవడం లేదు. దీంతో వారు కేవలం ఒక స్కూల్ సంబంధించిన పిల్లలను మాత్రమే కాకుండా ఒకే ఆటోలు రెండు మూడు స్కూళ్ళకు సంబంధించిన పిల్లలను ఆయా విద్యాసంస్థల వద్ద దించుతూ పెద్ద మొత్తంలో దండుకుంటున్నాయి.

వరద ముప్పును తగ్గించేందుకు సమన్వయంతో పనిచేయాలి

-ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, జూన్ 16 ప్రభాతవార్త :

వర్షాకాలంలో ముంపునకు గురయ్యే సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు వేగవంతంగా చేయాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్ మోడ్రన్ బేకరీ, దేవేందర్‌నగర్ రోడ్డు ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. మొదట రామంతాపూర్ మెయిన్ రోడ్, మోడ్రన్ బేకరీ సమీపంలో వర్షం పడితే నీరు నిల్వ ఉండే ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. భారీ వర్షాల సమయంలో నీరు నిల్వ కాకుండా చేపడుతున్న చర్యలు, ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పనితీరు, వర్షపు నీటి పారుదల పరిస్థితులను అధికారులు వివరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే రామంతాపూర్ దేవేందర్‌నగర్ రోడ్ వెంట ఉన్న ప్రధాన నాలాను కమిషనర్ పరిశీలించారు. నాలా నీటి ప్రవాహ సామర్థం, కొనసాగుతున్న నిర్వహణ పనుల పురోగతి, వర్షపు నీటి పారుదల పరిస్థితులను సమీక్షించారు. వర్షాకాలంలో ఎలాంటి అవరోధాలు లేకుండా నీటి ప్రవాహం కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో వరద ముప్పును తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ తనిఖీలలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఎంఎంసీ చీఫ్ ఇంజనీర్ అశోక్‌రెడ్డి, ఎంఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఈడీ పంకజ, ఉప్పల్ జోన్ హైడ్రా ఎస్ఎఫ్ఓ మోహన్‌రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో వర్షాకాల సన్నద్ధత పనులను పరిశీలిస్తున్న ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించాలి

-జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా

విద్యార్థులతో అక్షరాలు దిద్దిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

హైదరాబాద్, జూన్ 16,ప్రభాతవార్త:

విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఉపాధ్యాయులను ఆదేశించారు.మంగళవారం రాజ్ భవన్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి అల్పాహారాన్ని పరిశీలించి, మధ్యాహ్నం భోజనం తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని పాఠశాలలో కార్పొరేట్ స్థాయికి దీటుగా మౌలిక వసతులు కల్పించటం జరిగిందని అన్నారు. అలాగే విద్యార్థులకు గుణాత్మక విద్య అందాలని, విద్యార్థుల డ్రాప్ అవుట్స్ తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలోని విద్యార్థుల యొక్క అల్పాహారాన్ని అలాగే విద్యార్థులతో మమేకమై విద్యార్థితో ముచ్చటించారు. అలాగే విద్యాశాఖ అధికారులు అన్ని పాఠశాలలను నిరంతరం తనిఖీ చేయాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల వివరాలను ఆమె తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభం అవటంతో విద్యార్థుల తరగతి గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ముఖ్యంగా మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. పిల్లలకు మంచి వాతావరణంలో విద్యాబోధన జరగాలని ఉపాధ్యాయులకు ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మీ సురక్షతో భద్రతకు భరోసా..

- నెల రోజుల్లో 48 వేల మందికి పైగా నమోదు

నేరేడ్ మెట్,మల్కాజ్‌గిరి కమిషనరేట్ , జూన్ 16,ప్రభాతవార్త : ప్రజల భాగస్వామ్యంతో సురక్షిత సమాజాల నిర్మాణమే లక్ష్యంగా మల్కాజ్‌గిరి పోలీసు కమిషనరేట్ చేపట్టిన "మీ సురక్ష" కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గత నెల రోజులుగా నిర్వహిస్తున్న గృహ సహాయకులు, డ్రైవర్లు, భద్రతా సిబ్బంది, అద్దెదారులు, తాత్కాలిక నివాసితుల నమోదు, ధ్రువీకరణ కార్యక్రమంలో ఇప్పటివరకు 48,024 మందిని గుర్తించి నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.గత నెల 16న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా కమిషనరేట్ పరిధిని కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, నివాస సంఘాల వారీగా 4,12,308 నివాస సముదాయాలుగా విభజించి కార్యాచరణ చేపట్టారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు వివిధ ప్రాంతాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనరేట్‌లోని అన్ని మండలాల్లో మొత్తం 580 అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజల సహకారాన్ని కోరారు.గృహ సహాయకులు, ఇతర సహాయక సిబ్బందికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించడం ద్వారా అనుమానాస్పద కార్యకలాపాలను ముందుగానే గుర్తించడం, నేరాల నియంత్రణ, దర్యాప్తు సామర్థ్యాన్ని పెంపొందించడం, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు మరింత భద్రత కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.కార్యక్రమం పురోగతిని ప్రజలకు తెలియజేసేందుకు సోమవారం కమిషనరేట్ పరిధిలో 175 బృందాలను రంగంలోకి దించారు. వివిధ కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో నివాసితులతో సమావేశమై కార్యక్రమం ఫలితాలను వివరించారు. అలాగే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వ ప్రాంతాలు, గుంతలు, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్ వంటి ప్రజా భద్రతకు సంబంధించిన సమస్యలను వెంటనే తెలియజేయాలని సూచించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ బి. సుమతి పాల్గొని ప్రజలకు పురోగతి నివేదికను అందజేశారు. డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు తదితర అధికారులు కూడా పాల్గొన్నారు.

భక్తిపారవశ్యంలో ముంచెత్తిన భజన కళాకారులు

భక్తిభజన, గీతాలతో ఆధ్యాత్మికశోభను గుభాళిస్తున్న కళాకారులు

రవీంద్రభారతి, జూన్ 16 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో 99 రోజుల పాటు నిర్విరామంగా జరుపుతున్న సాంస్కృతిక మహోత్సవంలో 77వ రోజు మంగళవారం రాత్రి తెలంగాణ ప్రజాకళ ప్రదర్శనల్లో భజన కళాకారులు శ్రావ్యమైన భక్తిగీతాలతో వీక్షకులను భక్తిపారవశ్యంలో ముందచెత్తి ఆధ్యాత్మిక లోకంలో విహరింపజేశారు. ఈమేరకు శ్రీ శివభజన మందిరం, నాలాబజార్, సికిందరాబాద్ కళాకారులు భక్తిభజనలతో హోరెత్తించారు. ఎ.మల్లేష్‌బాబు బృందం అద్భుత సంగీత సహకారంతో భక్తిమార్గంలో పయనింపజేశారు. తబలాపై రవి, ప్యాడ్స్‌పై నరేష్ తమ వాద్యవిన్యాసాలతో మరింత మాధుర్యాన్ని జోడించి ఆకట్టుకున్నారు. కళాకారులు శ్రీనివాస్, దశరథ్, గోపాల్‌స్వామి, శ్రీనివాస్‌యాదవ్‌లు ఆలపించిన భక్తీగీతాలు సభికులను తన్మయుల్ని చేశాయి. నేటి తెలంగాణ ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు పి.నర్సింలు, డా. విజయ్‌కుమార్ తదితరులతో కలిసి కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

జనతా నగర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల గోదాంలో అగ్నిప్రమాదం

మూసాపేట్, జూన్ 16, ప్రభాతవార్త : కూకట్‌పల్లి పరిధిలోని జనతా నగర్‌లో మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మధ్యాహ్నం సుమారు 3.40 గంటలకు డయల్100కు సమాచారం అందడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.అగ్నిప్రమాదం జరిగిన ప్రాంగణాన్ని పిఐక్యూయువై కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల నిల్వ గోదాంగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంలో గోదాంలో నిల్వ ఉంచిన పలు ఎలక్ట్రిక్ వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి.సమాచారం అందుకున్న వెంటనే నాలుగు అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడం ఊరటనిచ్చే విషయం.పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, 108 వైద్య సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై విచారణ కొనసాగుతోందని కూకట్‌పల్లి పోలీసులు వెల్లడించారు.

వసంత కెమికల్స్‌గోడౌన్‌లో అగ్నిప్రమాదం ..స్క్రాబ్ దగ్ధం

కుత్బుల్లాపూర్, జూన్16 ప్రభాతవార్త : జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వసంత కెమికల్స్‌లిమిటెడ్ పారిశ్రామికవాడలో మంగళవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫ్యాక్టరీకి సమీపంలోని గోడౌన్‌లో నిలువ వుంచిన స్క్రాబ్ పాత రియాక్టర్లకు ఒక్కసారిగా మంటలంటుకుని ఉవ్వెత్తున మంటలు, పొగలు ఎగిసిపడ్డాయి. దీనితో మంటలు ఎలా అంటుకున్నాయో తెలియక కార్మికులు ఉరుకులు, పరుగులు పెట్టారు. వసంత్‌కెమికల్స్‌లోని గౌడౌన్‌లో గల పాత రియాక్టర్లకు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దీనితో మంటలనుండి వచ్చినపొగలు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో అప్రమత్తమైన కంపెనీ కార్మికులు, సెక్యురిటీ వెంటనే నీటినిపైప్‌లైన్లద్వారా చిమ్మి మంటలను ఆర్పారు. ఫైర్ సిలిండర్లు, నీటిపైప్‌లైన్‌ద్వారా ప్రెషర్‌తో మంటలను అదుపులోకి తెచ్చారు. దీనితో స్వల్పఅగ్నిప్రమాదంలో అటు కార్మికులు, ఇటు యాజమాన్యం ఊపిరిపీల్చుకున్నారు. ఫైర్ ఇంజన్లు వచ్చేలోపే ఫైర్ సిలిండర్లు నీటితో మంటలన అదుపుఒకి తెచ్చిన కార్మికులను యాజమాన్యం అభినందించారు.

'డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ' గా ఐటి కారిడార్ రహదారి

-యుఎస్ కాన్సులేట్ రోడ్డును ట్రంప్ అవెన్యూగా మారుస్తూ ప్రభుత్వ నిర్ణయం

గచ్చిబౌలి, జూన్ 16 ప్రభాతవార్త

నగరంలోని గచ్చిబౌలి ఐటి కారిడార్ రహదారి డోనాల్డ్ ట్రంప్ అవెన్యూగా మారనుంది. ఈమేరకు ఐటి కారిడార్ పరిధిలోని యుఎస్ కాన్సులేట్ రోడ్డును డోనాల్డ్ ట్రంప్ రోడ్డుగా నామకరణం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని నానక్‌రాంగూడలో గల యుఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయానికి ఆనుకొని ఉన్న రహదారిని డోనాల్డ్ ట్రంప్ ఆవెన్యూగా మార్చనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. ఈ రహదారికి ట్రంప్ పేరు పెట్టే ప్రతిపాధనపై గతంలోనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు వెల్లడించిన విషయం తెలిసిందే. గ్లోబల్ సిటీగా పేరుగాంచిన హైదరాబాద్, అమెరికా మద్య బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు వీలుగా, అంతర్జాతీయ పెట్టుబడులే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరుతో ఏర్పాటు చేయనున్న ఈ రోడ్డును జూన్ 23వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. జూలై 4వ తేదీన జరిగే అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జూన్ 23వ తేదీన నగరంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్, పలువురు ఉన్నతాధికారులు, దౌత్యవేత్తలు, ఐటీ పరిశ్రమ ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలుస్తుంది. హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తులు, సంస్థలను గౌరవించుకునే కార్యక్రమంలో భాగంగా ఐటి కారిడార్ రహదారికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆవెన్యూగా మార్చనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రహదారితో పాటు నగరంలోని పలు కీలక రహదారులు, జంక్షన్లకు గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీల పేర్లు పెట్టేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుంది. కాగా ఇటీవలే రావిర్యాల ఇంటర్ చేంజ్‌కు భారత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా పేరును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ఐటి కారిడార్‌లోని రహదారికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు పెట్టడంపై రాష్ట్రంలోని ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

నగరంలోని యుఎస్ కాన్సులేట్ కార్యాలయం

బంగారం కాజేశాడు.. సిసి కెమెరాలకు చిక్కాడు

- అంతర్ రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసిన ఖైరతాబాద్ పోలీసులు

జూబ్లీహిల్స్, జూన్ 16, ప్రభాతవార్త:

ప్రైవేటు బస్సులో ప్రయాణికుడిలా ఎక్కుతాడు.. ఏదైనా చేతిసంచి కనిపిస్తే ఇట్టే కాజేసి అక్కడి నుంచి తప్పించుకుంటాడు.. అలా ఒక ప్రయాణికుడి నగల బ్యాగు కాజేసి సీసీ కెమెరాలకు చిక్కిన నిందితుడిని ఖైరతాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. పంజాగుట్ట డివిజన్ ఇంచార్జి ఏసిపి సంజయ్ కుమార్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, డిఐ బాలస్వామి ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేవంలో వెల్లడించారు. కొద్ది రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ నుండి సంగారెడ్డికి ప్రైవటు బస్సులో ప్రయాణించారు. ప్రయాణికుడికి సంబంధించిన దాదాపు 62 గ్రాముల బంగారు ఆభరణాల బ్యాగు కనిపించ లేదు. దీంతో ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా డిఐ బాలస్వామి ఆధ్వర్యంలో క్రైం బృందం దర్యాప్తు చేపట్టింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా దర్శి గ్రామంకు చెందిన తాతపూడి తెల్ల రాజా అలియాస్ రాజు(48)ను సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిగా గుర్తించారు. అతని వద్ద నుంచి చోరీకి పాల్పడిన 62 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా నిందితుడిపై 2008 నుండి ఇప్పటివరకు కూకట్‌పల్లి, పేట్ బషీరాబాద్, ఏపీలోని నర్సరావుపేట, కృష్ణలంక, పంజాగుట్ట ఠాణాల పరిధిలో కేసులు ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా గతేడాది ఎల్బీనగర్, సైఫాబాద్ ఠాణాల పరిధిలో రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తమ విచారణలో గుర్తించారు. అంతర్‌రాష్ట్ర నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి సంజయ్‌కుమార్ వివరించారు. కాగా ఈ కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, డిఐ బాలస్వామి క్రైం బృందాన్ని ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి అభినందించారు. బస్సులో ప్రయాణం చేసే వారు జాగత్రలు తీసుకోవాలని, ప్రయాణ వివరాలను భద్రపర్చుకోవాలని సూచించారు.

ట్రావెల్ ఆపరేటర్లు సైతం బస్సు ఎక్కే, దిగే ప్రాంతంలో సీసీటీవీ కెమెరాను ఏర్పాటు చేసుకోవాలని, ప్రయాణికులను, వారి సామాగ్రిని గమనిస్తుండాలని సూచించారు.

నిందితుడిని, పట్టుబడిన నగలను చూపుతున్న ఎసిపి సంజయ్ కుమార్, చిత్రంలో వెంకటరెడ్డి, బాలస్వామి ఉన్నారు

సామాజిక భవనానికి మరమ్మతులు చేయండి

- ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి

సామాజిక భవనంలో స్థానికులతో మాట్లాడుతున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి.

జూబ్లీహిల్స్, జూన్ 16, ప్రభాతవార్తః
ఖైరతాబాద్ నియోజకవర్గంలోని గాంధీపుర బస్తీలో ఉన్న సామాజిక భవనంలో దెబ్బతిన్న పై అంతస్తు మధ్యభాగం మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి కోరారు. సమస్యలపై సమరంలో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో ఆయన పరిశీలించారు. ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణం అనంతరం మిగిలిన వ్యర్తాలను అలానే వదిలివేశారని, ఈ కారణంగా స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి ఆయా వ్యర్థాలను తొలగించాలని సూచించారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో పనిచేయని విద్యుత్ దీపాలను మార్చాలని జీహెచ్ఎంసీ విద్యుత్ విభాగ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రాంచందర్, సారంగపాణి, శౌరిరాజ్, కోటేష్ తదితర నేతలు పాల్గొన్నారు.

కాలేజీ, స్కూల్‌లో పోలీసుల జోక్యం తగదు

సమావేశంలో మాట్లాడుతున్న బిషప్ భాస్కర ముల్కల

సైఫాబాద్, జూన్ 16 ప్రభాతవార్త: భారత్ బైబిల్ కాలేజ్ (బిబిసి), నజరీన్ గ్రామర్ హై స్కూల్‌లో పోలీసుల జోక్యం సరికాదని భారత క్రిస్టియన్ కౌన్సిల్ ఛైర్మన్, కళాశాల పూర్వ విద్యార్థి బిషప్ భాస్కర్ ములకల చెప్పారు. పాఠశాల పున :ప్రారంభం రోజునే వివాదం చెలరేగడం బాధకరమన్నారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు రాజకీయ నాయకులు పోలీసుల అండదండలతో క్యాంపస్‌లో అలజడులు సృష్టించేందుకు పయత్రిస్తున్నారని ఆరోపించారు. రెండు వర్గాలుగా ఏర్పడి బిబిసి, నజరీన్ గ్రామర్ హై స్కూల్ పరువును బజారున పడేశారని విమర్శించారు. ఈ రెండు వర్గాల గోడవుల వల్ల విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని, విద్యార్థు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రెండు వర్గాలు చేస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం నిజనిర్ధారణ కమిటిని వేసి చట్ట ప్రకారం అనుమతి పొందిన బోర్డు సభ్యులకు కాలేజి, స్కూల్ అప్పగించాలి భాస్కర్ ములకల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జిపిఎస్‌లో పండుగ వాతావరణంలో అక్షరాభ్యాసం

చిన్నారులచే అక్షరాలు దిద్దిస్తున్న డిప్యూటీ ఐఓఎస్ విశ్వనాథం గుప్తా, ఉపాధ్యాయులు

చాంద్రాయణగుట్ట, జూన్ 16, ప్రభాతవార్త : పాతబస్తీ బండ్లగూడ మండల (విద్యా) పరిధిలోని లలితాబాగ్ జెండా వద్ద గల బేలా చందూలాల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పండుగ వాతావరణంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.హరి ఆధ్వర్యంలో రెండవ రోజున చిన్నారుల తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి చదువుల తల్లి శ్రీ సరస్వతీ మాతకు పూజలు నిర్వహించారు. బండ్లగూడ జోన్ ఉప పర్యవేక్షణాధికారి (డిప్యూటీ ఐఓఎస్) ఎస్. విశ్వనాథం గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. అందరిచే 'ఓం'కారం దిద్దించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఐఓఎస్ విశ్వనాథం గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్‌కు ధీటుగా విద్యాబోధన, క్రీడలు, ఐచ్ఛిక, బౌధిక్ అంశాలలో శిక్షణ నిస్తున్నట్లు తెలిపారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులు, డిజిటల్ బోధన చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్న సౌకర్యాలను వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.హిందుమతి, కె.వనజ, కె.సువర్ణ, జి.ఎన్.రాధాప్యారి, కె.సరిత, ఎ.శ్రీనివాసరావు, కె.సుజాత, ఎన్.మంజుల, వి.వెంకట రామారావు, విశ్రాంత ఉపాధ్యాయులు అనిరుధరావు సాథే, బస్తీ పెద్దలు పెండెం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఆటోవాలా

ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న జీడిమెట్ల సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డంమల్లేశ్, సబ్ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌సాగర్, జల్లాలక్ష్మీనాథ్ తదితరులు

కుత్బుల్లాపూర్, జూన్16 ప్రభాతవార్త
రోడ్డుపై పిల్లలు ఇద్దరూ గుక్కపెట్టి ఏడుస్తున్నారు. రోడ్డుపై పోయే వాహనదారులు చూస్తూ వెళ్లిపోతున్నారే తప్ప ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇదేసమయంలో అటుగా వచ్చిన ఆటోడ్రైవర్ ఆ పిల్లలిద్దరినీ చేరదీసి వివరాలు అడిగినా వారికి తెలియడంలేదు. వారు చెప్పడంలేదు. ఇక లాభంలేదనుకుని వారిని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు చేరవేయగా పోలీసులు సోషల్‌మీడియాద్వారా విస్తృత ప్రచారంద్వారా తల్లిదండ్రుల వద్దరు చేర్చారు. జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన ప్రకారం గాంధీనగర్ పారిశ్రామివాడలో ఇద్దరు పిల్లలు తప్పిపోయి రోడ్డుమీద గుక్కపెట్టి ఏడుస్నూరు. అటుగా వచ్చిన ఆటోడ్రైవర్ శ్రీకాంత్ ఆ ఇద్దరు పిల్లలను వివరాలు అడిగినా చెప్పడంలేదు. దీనితో తన ఆటోలో ఇద్దరు పిల్లలను జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. పోలీసుల విచారణలో ఆ ఇద్దరు పిల్లలు గాంధీనగర్ బస్టాప్‌లో నివసిస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన ఆధర్, శివాన్స్‌గా గుర్తించి వారిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. తప్పిపోయిన పిల్లలను సామాజిక బాధ్యతగా పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌ను జీడిమెట్ల సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్, సబ్ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ సాగర్‌లు తల్లిదండ్రుల సమక్షంలో శాలువాతో సత్కరించారు. గాంధీనగర్ వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జల్లాల క్ష్మీనాథ్ అతనిమిత్రబృందం ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌ను, జీడిమెట్ల పోలీసులను అభినందించారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయండి : ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి

చిక్కడపల్లి జూన్ 16 (ప్రభాతవార్త) : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, తక్షణమే అపాయింట్ మెంట్ తేదీని ప్రకటించాలని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ జోనల్ కమిటీ సర్వ సభ్య సమావేశం మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా థామస్ రెడ్డి మాట్లాడుతూ సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం అనవసర కాలయాపన చేస్తుందని ఆరోపించారు. కార్మికులందరీ కోరిక ఆర్టీసినీ ప్రభుత్వంలో విలీనం చేయడం ఒక్కటే మార్గం అని, వెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేసి, అపాయింట్ మెంట్ తేదీని ఖరారు చేయాలన్నారు. ఆర్టీసీలో పదవి విరమణ చేసిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతన బకాయిలు రాకపోవడం వల్ల విశ్రాంత ఉద్యోగులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. సమస్యల సాధనంలో విశ్రాంత ఉద్యోగులు తలపెట్టిన ఉద్యమానికి తెలంగాణ మద్దూర్

ప్రసంగిస్తున్న ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి

యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని థామస్ రెడ్డి ప్రకటించారు. కాగా డిపోల వారిగా కమిటీలు ఏర్పాటు చేసి యూనియన్ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యదర్శి అర్. ఎన్. రెడ్డి, కమలాకర్ గౌడ్, జి పి ఆర్ రెడ్డి, బి.యాదయ్య, నరేందర్, కరుణ, ఎంఎస్ అలీ, శ్రీనివాస్, రవినాథ్, శంకర్, లక్ష్మణ్ సహ వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో ఈ సమావేశానికి హాజరయ్యారు.

అధికారుల పర్యవేక్షణ కరువు.. స్థానికుల నిరసన

- బాగ్ లింగంపల్లిలో డ్రైనేజీ వ్యవస్థ చిందరవందర

చిక్కడపల్లి, జూన్ 16 ప్రభాతవార్త : బాగ్ లింగంపల్లి డివిజన్ పరిధిలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ సీవరేజ్ బోర్డు అధికారుల నిర్వాకం స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈశ్వర్ రెడ్డి గల్లీ నుండి వెంకటేశ్వర మెడికల్ హాల్ వరకు చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు అటు అపార్ట్‌మెంట్ వాసులకు, ఇటు సామాన్య ప్రజలకు శాపంగా మారాయి. కొత్త లైన్ వేసే క్రమంలో లలిత మాన్షన్ అపార్ట్‌మెంట్‌కు ఉన్న పాత డ్రైనేజీ కనెక్షన్‌ను జేసీబీతో ధ్వంసం చేశారు. కొత్త పైప్‌లైన్‌కు అనుసంధానించడంలో అధికారులు, సిబ్బంది ఘోరంగా విఫలమయ్యారు. డ్రైనేజీ నీరు బయటకు వెళ్లక అపార్ట్‌మెంట్ వాసులు అల్లాడుతుండటంతో, స్థానిక మేనేజర్ జీవన్ జ్యోతికి ఫిర్యాదు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పనులు అర్ధాంతరంగా నిలిపివేయడంతో, ఇప్పుడు కొత్త కనెక్షన్ ఎప్పుడు ఇస్తారో తెలియక అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్ల విధ్వంసం.. అధికారుల తీరుపై డీఈఈ ఆగ్రహం:
క్షేత్రస్థాయిలో నాణ్యత లేని పనులు, రోడ్ల ధ్వంసంపై జీహెచ్ఎంసీ డీఈఈ గీత కుమారి మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను పరిశీలించిన ఆమె స్థానిక వాటర్ బోర్డు సెక్షన్ అధికారులు నిబంధనలను పాటించకుండా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టరుపై మండిపడ్డారు. వెంటనే పనులను నిలిపివేయాలని ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనలో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు" అని ఆమె తేల్చి చెప్పారు. తవ్విన రోడ్డును తిరిగి ఎందుకు బాగు చేయలేదని ఆమె ప్రశ్నించారు.

చిక్కడపల్లి లలిత మాన్షన్ ఎదుట డ్రైనేజీ పనులు చేపట్టిన ప్రదేశం ఇదే

అధికారుల పర్యవేక్షణ కరువు.. స్థానికుల నిరసన:
నిర్మాణ పనుల ఆలస్యం, అసంపూర్తిగా వదిలేసిన రోడ్ల వల్ల స్థానికులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా వాటర్ బోర్డు ఉన్నతాధికారులు స్పందించి, బాగ్ లింగంపల్లి పరిధిలో జరుగుతున్న పనుల నాణ్యతపై దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బడిపిల్లలకు పాఠ్యపుస్తకాలు అందజేత

పాఠ్యపుస్తకాలు స్వీకరించిన విద్యార్థులతో వనం సంగీతయాదవ్.

జూబ్లీహిల్స్, జూన్ 16, ప్రభాతవార్తః
సోమాజీగూడ డివిజన్ హరిగేట్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలను మంగళవారం సోమాజీగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. కార్పొరేట్ పాఠశాల పిల్లలతో పోటీపడి తమ సత్తాను చాటాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వనం శ్రీనివాస్‌యాదవ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోడి పాలనపై ప్రచారం

ప్రజలకు వివరిస్తున్న బిజెపి గొల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమామహేంద్ర,మోర్చ ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వాలు

బేగంబజార్,జూన్16ప్రభాతవార్త:
దేశానికి భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 12 సంవత్సరాల పాటుసుపరిపాలన అందించినట్లు గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు టి.ఉమామహేంద్ర అన్నారు. గన్‌ఫౌండ్రిడివిజన్ పరిధిలోని ఇసామియాబజార్ తదితర ప్రాంతాల్లో నరేంద్రమోడి 12 సంవత్సరాల పరిపాలనపై ప్రజలకు తెలంగాణ బిజెపి ఎస్సీమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వాతో కలిసి ప్రచారం నిర్వహించారు .కేంద్ర నిధులతో అభివృద్ధి చేసిన ఆయుర్వేధిక్ ఆసుపత్రి సందర్శించారు.అక్కడి నుంచిబయలు దేరి ప్రముఖుల తోపాటు వ్యాపారులను కలిసి నరేంద్రమోదీ దేశానికి అందించిన సుపరిపాలనపైరూపొందించిన పుస్తకాలను అందించారు.ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌బిస్వా,బిజెపి నాయకులు సురేందర్, సంజయ్‌గనాటే,సురేష్,శ్రీకాంత్,నిర్మల్,కావ్య,శైలేందర్, సురేందర్‌శర్మ,సురేఖ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను డయేరియా నుంచి కాపాడుకుందాం

యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త: కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా చిన్నారులను డయేరియా నుంచి కాపాడుకుందామని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్టాప్ డయేరియా పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులను డయేరియా నుంచి కాపాడటం, డయేరియాపై చిన్నారుల తల్లి తండ్రులకు అవగాహన కల్పించటం కోసం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ ప్రతిష్టాత్మకంగా జూన్ 16 నుంచి జూలై 31 వరకు నిర్వహిస్తున్నారని తెలిపారు. డయేరియా నివారణలో భాగంగా ఐదేళ్ల లోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు అందివ్వటం జరుగుతుందని, ఐదేళ్ల వయసు ఉన్న చిన్నారుల తల్లి తండ్రులు తప్పకుండా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలి

సమావేశంలో ఉషశ్రీ,సుగుణ,మామిడి మాధవి తదితరులు..

కార్వాన్,జూన్16(ప్రభాతవార్త)
కార్వాన్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మామిడిమాధవి నాయకత్వంలో సుబ్జీమండి పార్టీ కార్యాలయంలో ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్,అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణలు పాల్గొని మాట్లాడుతూ...నారీ శక్తి వందన అధినియమ్ 2023 మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణం అమలు చేయండి,అంటూ ఆజ్ కరో,అభీ కరో నినాదంతో పోస్ట్‌కార్డులపై సంతకాల సేకరణ నిర్వహించారు.మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ,ఎస్టీ మహిళలే కాకుండా ఓబీసీ మహిళలను కూడా చేర్చాలని డిమాండ్ చేస్తూ పోస్ట్‌కార్డులపై సంతకాలు సేకరించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో మహిళా కాంగ్రెస్ పాత్ర కీలక పనితీరుపై కూడా ఈ సమావేశంలో చర్చించారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో భారీ మెజారిటీ సీట్లు సాధించేందుకు మహిళా కాంగ్రెస్ పట్టుదలతో పనిచేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో సోనియా,మారి,జి.వనజ,హేమలత, వనజ, షకీలా,అనురాధ, దుర్గ,హేమలత, సౌమ్య, సునీత, తన్య, సమీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బడుల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి..

కార్వాన్,జూన్16(ప్రభాతవార్త)
తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సామజిక కార్యకర్త రాజు మల్తుంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల వసూళ్ల ఇష్టారాజ్యాన్ని అడుకునేందుకు కొత్త నిబంధనలను ఈ నెలలోనే అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని,వెంటనే అమలు చెయ్యాలని రాష్ట్ర విద్యా శాఖాను కోరారు. అదేవిధంగా విద్యా సంస్థలను వసతుల ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించి,ఆయా కేటగిరీలకు నిర్దిష్ట ఫీజులను నిర్ణయించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని గుర్తు చేశారు.దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు అదనపు ఫీ జుల భారం నుంచి ఉపశమనం లభించనుందని పేర్కొన్నారు.

ఓటరు జాబితాలో పేర్లను పరిశీలించుకోవాలి

ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

సికింద్రాబాద్, జూన్ 16 ప్రభాతవార్త: ప్రత్యేక సర్వ సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నేతలు అంబర్ నగర్ ప్రాంతంలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్ జాబితాను పరిశీలిస్తూ ఓట్లు లేని అర్హులైన వారందరికి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. అంబర్ నగర్ లో చాలామంది ఓట్లు ఓటరు జాబితాలో లేకపోవడంతో బీఆర్ఎస్ నేతలు అప్రమత్తమయ్యారు. అర్హులైన వారందరు తమ పేర్లు ఓటరు జాబితాలో ఉందో, లేదో పరిశీలించుకోవాలని కోరారు. ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు విచారించకుండా ముందుగానే ఓటుహక్కు ఉన్నది, లేనిది సరిచూసుకోవాలని సూచించారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను అధికారులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు, సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మందజగన్, చింతకింది మల్లేష్, జానకీరామ్ కన్నా, కిషోర్, వినోద్, భాస్కర్, కలీం, సంపత్, రోహిత్, , బల్ల గీతా, మానస ఇతర నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ డీఇ, ఏడీఇ కార్యాలయాల్లో రెచ్చిపోతున్న అవినీతి తిమింగలాలు

అధికారుల అవినీతి లీలలు..ఇష్టారాజ్యంగా వసూళ్లు

హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త
విద్యుత్ డీఇ, ఏడీఇ కార్యాలయాలు అవినీతి, అక్రమార్జనకు నిలయాలుగా మారాయి. హబ్సీగూడ, కీసర, సైనికపురి బోయిన్‌పల్లి, కంటోన్మెంట్, ప్యారడైజ్, డీఇ, ఏడీఇ కార్యాలయాలల్లో కొందరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నారు.కొత్త విద్యుత్ కనెక్షన్లకు వర్క్ ఎస్టిమేషన్ నుంచి బహుళ అంతస్తులు ప్యానల్ బోర్డులు, డీటీఆర్ మీటర్ల జారీలకు అందినంత దండుకుంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినా, ఫీడర్లు ట్రిప్పయినా క్షేత్రస్థాయిలోని కొందరు అధికారులు, సిబ్బంది స్పందించకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. విద్యుత్ సమస్యలు నెలకొంటే కొందరు డీఇలు, ఏడీఇలు, ఎఇలు, లైన్‌మెన్‌లు పట్టించుకోవడంలేదు. కార్యాలయాలకు అధికారులు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. వీరిపై ఉన్నతాధికారుల నిఘా కొరవడడంతో కార్యాలయాలను తమ స్వంత ఎస్టేట్లల భావిస్తూ తమకు చిత్తం వచ్చినప్పుడు కార్యాలయాలకు వస్తూ, పోతుండడతో ఆయా పనుల కోసం వచ్చే వినియోగదారులు విసిగిపోతున్నారు. విద్యుత్ కనెక్షన్ల జారీలో ఉన్నటువంటి నిబంధనలు కొందరు అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. విద్యుత్ ప్యానల్ బోర్డుల ఏర్పాటులో కొందరు అధికారులు, సిబ్బంది అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా కొందరు అధికారులు, సిబ్బంది ప్యానల్ బోర్డుల పేరు చెప్పి విద్యుత్ మీటర్ల జారీలో అందినంత దండుకుంటున్నారు. పరిమితికి

మించితే కనెక్షన్లకు సంబంధించి ప్యానల్ బోర్డు ఏర్పాటు తప్పనిసరి అని పేర్కొంటున్న అధికారులు కొందరికి మాత్రమే ఈ నిబంధనల వర్తింపచేయడం బట్టి చూస్తే కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించంతో పాటు ఏ మేర అక్రమాలకు ప్పాలడుతున్నారో అర్థమవుతుంది. వాణిజ్య (కమర్షియల్) నిర్మాణాలు, బహుళంతస్తుల భవనాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కొత్త కనెక్షన్లకు అక్రమ వసూళ్ళు లక్షల్లో జరుగుతున్నట్లు సమాచారం. శివార్లలో వ్యక్తిగత గృహాలతోపాటు బహుళంతస్తుల భవ నాలతోపాటు కమర్షియల్ భవనాలు, విల్లాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. పెద్దఎత్తున వెలుస్తున్న నిర్మాణాలు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. కొత్త కనెక్షన్ కావాలన్నా, ఇంటి ముందు అదనపు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలన్నా, కొత్త లైన్ వేయాలన్నా, అపార్ట్‌మెంట్‌లలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలన్నా పెద్ద మొత్తంలో లంచాలు ఇవ్వనిదే పనులు కావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాన్సాఫార్మర్ల మంజూరుకు పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జంగమ్మెట్ సర్కిల్లో పర్యటించిన జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

చాంద్రాయణగుట్ట, జూన్ 16, ప్రభాతవార్త : మహానగరపాలక సంస్థ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం జంగమ్మెట్ సర్కిల్ (24)లో సుడిగాలి పర్యటన చేశారు. చాంద్రాయణగుట్ట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పాపయ్య, సూపరింటెండింగ్ ఇంజనీరు నరేందర్‌గౌడ్, ఇతర అధికారులతో కలిసి పలు చోట్ల జరుగుతున్న పనులపై క్షేత్రస్థాయిలో అధికారులతో చర్చించారు. కందికల్ నల్లవాగులో పూడికతీత పనులను పరిశీలించి వర్షాకాలంలో వరద సమస్య రాకుండా నాణ్యతతో, వేగంగా పనులు జరగాలని ఇంజనీరింగ్, ప్రాజెక్ట్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. చారిత్రక నేపథ్యం గల రాజన్నబావిని సందర్శించారు. బావి పరిసరాలలో అపరిశుభ్రత, రక్షణ కంచె, మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న బోనాల పండుగ సందర్భంగా ప్రధాన ఊరేగింపు సాగే కందికల్‌గేట్ ఆర్వోబి, ఉప్పుగూడ, ఛత్రినాక కూడలి, లాల్‌దర్వాజా మార్గాలలో ఉన్న ఇబ్బందులను గమనించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ నేపథ్యంలో అమ్మవారి ఆలయాల వద్ద, ప్రధాన ఊరేగింపు సాగే మార్గంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వరద సమస్య లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలలో నాలాలు, కచ్చామోరి మ్యాన్‌హోల్స్, పూడిక తీత వంటి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. రాజన్నబావి, లక్ష్మీనగర్, ఛత్రినాక, ఉప్పుగూడ ప్రాంతాలకు ముంపు సమస్య లేకుండా ఎస్‌డబ్ల్యూ డ్రైన్ (స్టామ్ వాటర్ డ్రైన్) నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. భారీ వర్షాలతో వచ్చే సమస్యలపై తక్షణమే స్పందించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పారిశుధ్య సమస్య లేకుండా సంబంధిత అధికారులు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. జెడ్సీ వెంట

విద్యార్థులకు అల్పాహారం అందించడం అభినందనీయం : ఎమ్మెల్యే శ్రీగణేష్

బొల్లారం ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,జూన్ 16 ప్రభాతవార్త: ప్రజా పాలన ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో మంచి ఫలితాలు సాధించగలుగుతారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్,మిల్క్‌పథకాన్ని మంగళవారం బొల్లారం సదర్ బజార్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రోజు పోషకాహారంతో కూడిన అల్పాహారం,పాలు అందిస్తున్నామన్నారు. పేద విద్యార్థులకు ఈ పథకం ఎంతోమేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అధికారులు రామలింగారెడ్డి, విక్రమాధిత్య, సీనియర్ కాంగ్రెస్ నేతలు చింతల వేణుగోపాల్ రెడ్డి, నర్సింహ్మ కన్నన్,బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

అల్వాల్, జూన్ 16 ప్రభాతవార్త: మల్కాజిగిరి నియోజకవర్గంలోని స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 190 తుర్కపల్లి డివిజన్ బృందావన్ కాలనీ హిందూ స్మశాన వాటిక, బంధం బావి ముస్లిం స్మశాన వాటిక అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. 65.50లక్షలు వ్యయంతో స్మశాన వాటికలను అభివృద్ధి పరుస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు డోలి రమేష్, శోభన్, పవన్, భాస్కర్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ అల్వాల్ విద్యుత్ షాక్ ప్రమాద బాధిత కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పరామర్శించారు. ప్రమాద తీవ్రత తదుపరి ప్రభుత్వ యంత్రాంగం స్పందన గురించి ఆరా తీశారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం ఇక్కడ స్పష్టంగా కనపడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుటుంబానికి విద్యుత్ శాఖ ద్వారా నష్ట పరిహారం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్ ఇతరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ సన్నాక సమావేశంలో ఎర్రబెల్లి సతీష్ రావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 16, ప్రభాతవార్త

ఈ నెల 23న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జరగబోయే శేరిలింగంపల్లి నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశ సభకి సన్నాహకంగా మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నవతారెడ్డి, జూపల్లి సత్యనారాయణ, అనిల్ రెడ్డి, మారబోయిన రవి యాదవ్, పొట్టా నరేందర్ యాదవ్, శ్రీకాంత్, కార్తీక్, శ్రీనివాస్ గౌడ్, సుబ్బరాజు, హరీష్ రావు, విజయ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పద్మ, రోజా, గోపరాజు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గృహ కార్మికుల నిరసనకు ఎమ్మెల్యే కృష్ణారావు మద్దతు

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 16, ప్రభాతవార్త

అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవము సందర్భంగా తమ యొక్క న్యాయమైన డిమాండ్ల కొరకు మంగళవారం ఇందిరా పార్క్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజి కార్పొరేటర్ ముద్దం నరసింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు తమకు ఈఎస్ఐ, వచ్చేలా చూడాలని అలాగే డబల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేసేలా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఈ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అలాగే బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి మీ యొక్క సమస్యలను తెలియపరచి అసెంబ్లీలో చర్చించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గృహ కార్మికులు ప్రతినిధులు నిర్మల, నవనీత, మంజుల, విజయలక్ష్మి, లిస్సి జోసెఫ్. పద్మ, లలిత పాల్గొన్నారు.

ఆగస్టు 2న ఉజ్జయిని మహంకాళి బోనాలు : ఎమ్మెల్యే తలసాని

ఎమ్మెల్యే తలసానికి బోనాల ఉత్సవాల లేఖను అందజేస్తున్న ఉజ్జయిని మహంకాలి ఆలయ ఈఓ మోహన్ రెడ్డి

అడ్డగుట్ట,జూన్ 16 ప్రభాతవార్త:

సికింద్రాబాద్‌లో శ్రీ ఉజ్జయిని మహంకాలి అషాడమాస బోనాల ఉత్సవాలను ఆగస్టు 2వ తేదీన నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పండితులు మాజీ మంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి బోనాల ఉత్సవాల వివరాలను ఆలయ సిబ్బంది ఎమ్మెల్యే తలసానికి లేఖను అందజేశారు. ఈ సందర్భంగా జూలై 19న ఘటాల ఊరేగింపుతో ప్రారంభం అవుతుందని,ఆగస్టు 2న అమ్మవారికి బోనాల సమర్పన,3వ తేదీన రంగం (భవిష్యవాణి) ఉంటాయని ఈఓ వివరించారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్,రాంమోహన్ యాదవ్ పాల్గొన్నారు.

గుండె పోటుతో విద్యావేత్త వినేష్ కుమార్ మృతి

చార్మినార్,జూన్ 16 ప్రభాతవార్త : విద్యావేత్త,వర్దమాన్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న వి.వినేష్ కుమార్ గుండె పోటుతో అత్తాపూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.తెలంగాణ కాంగ్రెస్ కమిటి కార్యదర్శి జి. కన్నయ్యలాల్‌తో పాటు పలువురు ప్రొఫెసర్ వి.వినేష్ కుమార్ ఆకాల మరణం పట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పాతబస్తీ పురానాపూల్ శ్మశాన వాటికలో మంగళవారం అంత్యక్రియలు జరిగాయి.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం : కొలన్ హన్మంత్ రెడ్డి

నిజాంపేట్, జూన్ 16, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రగతి నగర్ డివిజన్ (276)లో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ప్రగతి నగర్ ప్రాంతంలో తాగునీటి కొరత కారణంగా ప్రజలు నిత్యం ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు.వినతిపత్రం స్వీకరించిన కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రగతి నగర్ ప్రజలు చాలా కాలంగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని అన్నారు. ప్రజలకు తగిన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ విషయమై హైదరాబాద్ మెట్రోపాలిటన్

కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తాగునీటి సమస్యను సమగ్రంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆలేటి శ్రీనివాస్ రావు, మురళీకృష్ణ, నారాయణ రెడ్డి, సురేంద్ర కుమార్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి, ఆది రెడ్డి, మహేష్, మధుసూదన్ రెడ్డి, రఫత్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై బిఆర్ఎస్ నేతల మండిపాటు

పేట్ బషీరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త

రాష్ట్రంలో తాగునీటి సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ వేసవి కాలం ముగిసినా అనేక కాలనీలు, గ్రామాలు, తండాలు, బస్తీలలో తాగునీటి కొరత కొనసాగుతోందన్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు గంటల తరబడి నీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు అందించామని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహణ లోపాలు, నిర్లక్ష్యం కారణంగా నీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని ఆరోపించారు. అనేక ప్రాంతాల్లో వారాల తరబడి సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదని, ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న నీరు అవసరాలకు సరిపోవడం లేదన్నారు. ట్యాంకర్ల కోసం ప్రజలు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, పైపులైన్ల మరమ్మతులు, లీకేజీల నివారణ పనులు కూడా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని విమర్శించారు. ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదని, మరోవైపు పారిశుద్ధ్య నిర్వహణ కూడా పూర్తిగా క్షీణించిందని ఆరోపించారు. కాలనీల్లో చెత్త తొలగింపు సక్రమంగా జరగకపోవడం,

డ్రైనేజీల శుభ్రత లేకపోవడం, దోమల వ్యాప్తి పెరగడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందన్నారు.వర్షాకాలం సమీపిస్తున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజా సమస్యల పరిష్కారంలో చేతులెత్తేసిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని ప్రాంతాలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని, అదనపు ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

డ్రైనేజీ సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ కార్పొరేటర్

జీడిమెట్ల, జూన్ 16, ప్రభాతవార్త

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సూచనలతో సుభాష్ నగర్ డివిజన్‌లోని శాంతినికేతన్ స్కూల్ సమీపంలో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ సమస్యను మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా డ్రైనేజీ మరమ్మత్తు పనులను పర్యవేక్షించిన ఆయన, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాగునీటి కొరత లేకుండా సమర్థవంతంగా పరిపాలన సాగిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ నిరక్ష్య వైఖరి కారణంగా ప్రజలు మౌలిక సదుపాయాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.ప్రజలకు అవసరమైన తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన సురేష్ రెడ్డి, స్థానిక సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, సరస్వతి ఫౌండేషన్ చైర్‌పర్సన్ డా. పద్మలత రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించడం మనందరి బాధ్యత : బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 16, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బండి రమేష్ ఆధ్వర్యంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం కూకట్‌పల్లి వై జంక్షన్ ఎంకెఎన్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ జనరల్ సెక్రటరీ సతీష్ సావంత్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్ మన్నే సతీష్, తెలంగాణ బ్రాహ్మణ సంఘం వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్, టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, పటోళ్ళ నాగిరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ పుష్పా రెడ్డి తదితరులు హాజరై బిఎల్ ఏలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం శిక్షణ శిబిరం ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడటం, అక్రమాలు జరగకుండా అప్రమత్తంగా ఉండటం, ప్రతి ఇంటికి చేరుకుని ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడం ప్రతి

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒక్కరి బాధ్యత అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరం ద్వారా బిఎల్‌ఏలు మరింత సమర్థవంతంగా పనిచేసి, ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, మైనారిటీ నాయకులు అనుబంధ సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

విహెచ్ దంపతులను సన్మానించిన లక్పతి యాదగిరిగౌడ్

విహెచ్ దంపతులను సన్మానిస్తున్న పిసిసి మాజీ కార్యదర్శి లక్పతి యాదగిరిగౌడ్

హైదరాబాద్, జూన్ 16 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, మాజీ ఎంపి వి.హనుమంతరావు దంపతులను పిసిసి మాజీ కార్యదర్శి లక్పతి యాదగిరిగౌడ్ శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం అంబర్‌పేటలోని విహెచ్ నివాసంలో జరిగిన ఆయన జన్మదిన వేడుకల్లో పాల్గొని యాదగిరిగౌడ్ మాట్లాడుతూ హనుమంతరావు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా నాటి నుంచి నేటి వరకు పార్టీ నియమ నిబంధన కట్టుబడి సైనికుల పనిచేస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వికాత్ భాయ్,బాగ్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, తిలక్‌నగర్ బస్తీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, సీనియర్ నాయకులు పృద్వి, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్‌నగర్ బస్తీ సర్వసభ్య సమావేశం

యూసుఫ్‌గూడ, 16 జూన్, ప్రభాతవార్త : రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్ పీజేఆర్‌నగర్ బస్తీలో బస్తీ వాసులు సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటి వరకు బస్తీలో గత 10 సంవత్సరాలుగా సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడంతో బస్తీలో దాదాపుగా పది సంవత్సరాల నుంచి అభివృద్ధి కుంటుపడిందని అధ్యక్షుని పదవి అయిపోవడంతో స్థానిక సమస్యలను పట్టించుకునే నాయకుడు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకుగాను తొందర్లోనే బస్తీ అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించేందుకు తీర్మానించుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, Sirigiri Madhavi W/o. Pratap Ganesh R/o. 6-1-192, Flat No.304, Pratap Residency, Padmarao Nagar, Sec-Bad. Changed My Name as **PRATAP MADHAVI** for All records purpose.

★ I, Landa Hemalatha W/o. Allada Mahender Reddy R/o. H.No. 8-1-173, Brundavan Colony, Mailardevpally, Hyd. Changed My Name as **ALLADA HEMALATHA** for all records purpose.

★ I, Gondampalli Pavan kumar, S/o Gundrapalli Laxminarayana (wrongly recorded as Gondampalli Laxminarayana in my SSC records), residing at Flat no. 403, M.Rs Sairama Residency, Laxmi nagar Colony, Attapur, Ranga reddy, Telangana - 500048, have changed my name to Gundrapalli Pavan Kumar for all future purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల పిఆర్‌సీ బకాయిలు తక్షణమే చెల్లించాలి

కంటోన్మెంట్,జూన్ 16 ప్రభాతవార్త:

ఆర్టీసీ సంస్థలో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగులకు 2017, 2021 పి.ఆర్.సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్‌లోని ఆర్టీసీ రీజనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు సకాలంలో వైద్య సదుపాయాలు, మందులు పంపిణీ చేసేందుకు తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. పదవీ విరమణ చేసిన.వి. ఆర్.ఎస్.తీసుకున్న ఆర్టీసీ ఉద్యోగులు మరణించినప్పుడు దహన సంస్కరణలకు తక్షణమే రూ. 30 వేలు అందజేయాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగి ప్రతి సంవత్సరం ఎస్. ఆర్.బి.ఎస్. లైఫ్‌సర్టిఫికెట్‌ను అనారోగ్య రీత్య 3 సంవత్సరాలు దాటిన వారికి లైఫ్‌సర్టిఫికెట్ ఇవ్వడానికి అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు రాంమోహన్ గౌడ్, బి.రాజ



సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఆందోళన చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

య్య, ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, సికింద్రాబాద్ రీజియన్ అధ్యక్షులు లక్ష్మి నారాయణ పటేల్,కార్యదర్శి శేఖర్ రెడ్డి,నర్సింహులు,పి.సి.మౌలి,రమణయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్.ఎం.సుచిత్రకు వినతిపత్రం అందజేశారు.

శృంగేరి జగద్గురువుల ఆశీస్సులు పొందిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జగద్గురువులు ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద

నిజాంపేట్, జూన్ 16, ప్రభాతవార్త

కర్ణాటకలోని శృంగేరి శారదా పీఠాన్ని బీఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సందర్శించి జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతి మహాస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ఆశీస్సులు పొందారు.శ్రీ శృంగేరి శారదా పీఠం జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామివారి దివ్య అనుగ్రహంతో దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదా పీఠంలోని జగద్గురువులు విధుశేఖర భారతి స్వామివారిని మంగళవారం దర్శించుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, వారి ఆశీస్సులు స్వీకరించారు.ఈ సందర్భంగా జగద్గురువులను, శృంగేరి శారదా మాతను ప్రార్థించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆశీర్వచనాలు స్వీకరించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో శృంగేరి శిష్యులు రాచర్ల రవిచంద్ర శర్మతో పాటు ఇతర భక్తులు పాల్గొన్నారు. జగద్గురువుల ఆశీస్సులతో ప్రజా సేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగుతానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నం. 16, పని పేరు: 18 పనుల కొరకు రాజేంద్రనగర్ జోన్, సర్కిల్-19, రాజేంద్రనగర్‌లో వాహనాల పార్కింగ్ షెడ్ నిర్మాణం, VDCC/CC రోడ్ ప్యాచ్‌లు వేయటం, UGD మరియు CC రోడ్ వేయుట మొదలగునవి. అంచనా మొత్తం/ECV: రూ.155.10 లక్షలు. డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ & సమయం: 18.06.2026 సా.4.30 గం. వద్ద, బిడ్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: 22.06.2026 సా.4.40 గం. వద్ద. EE/SE పేరు, చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, GHMC, సెల్ నం: 9989930608. ఇ-మెయిల్ Id: eec11.ghmc2@gmail.com.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ సర్కిల్, GHMC
DIPR.No.4367-PP/CL/Advt/1/2026-27, తేది: 16.06.2026

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
నిట్ నం. 13/SE(STSQM)/HQ/CMC/2026-27, పని కేటగిరీ: ఔట్‌సోర్స్‌డు మానవశక్తి యొక్క నియామకం. అంచనా మొత్తం (రూ.లక్షలలో): 92.04. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / చివరి తేదీ & సమయం: 17.06.2026 ఉ.11.30 గం. 24.06.2026 ఉ.11.30 గం. అధికారి పేరు & చిరునామా, సెల్ నం: SE, STSQM, HQ, CMC 9063836124.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, STSQM, HQ, CMC
DIPR

మహిళా శక్తిని చాటుతాం:చికోటి

చీకోటి ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న రాజ్యలక్ష్మి

ఎల్.బి.నగర్, జూన్ 16 ప్రభాతవార్త:
స్త్రీ శక్తిని ప్రపంచానికి చాటాలని బీజేపీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేటలో ఐవీఎంఎస్(ఇంటర్నేషనల్ వాసవీ మహిళా సమాఖ్య) సంఘా వ్యవస్థాపక అధ్యక్షురాలు ఉప్పల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీలు అని అన్నారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే అన్ని రంగాలలో అబ్యున్నతి సాధించవచ్చు అన్నారు. అనంతరం గోవధను నిషేధించాలని, గోవుల రక్షణకై పోరాడుతామని మహిళలతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సబ్యులు సృజన, వాసవీ, సంతోషి, మౌనిక, చైతన్య, స్వాతి, జ్యోతి పాల్గొన్నారు.

డిసిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



డిసిని సన్మానిస్తున్న గణేష్‌నేత

ఎల్.బి.నగర్, జూన్ 16 ప్రభాతవార్త:
హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నూతనంగా భాద్యతలు స్వీకరించిన సందర్భంగా అజ్మీరస్వామిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. శ్రీరామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, చిలుకుల వెంకన్న ఆధ్వర్యంలో మంగళవారం హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ను కలిసి పుష్పగుచాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. ప్రబుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తామన్నారు.

వర్షాకాలంలో ముందస్తు చర్యలు : జెడ్‌సి రాధికగుప్తా

వర్షాకాలంలో ముందస్తు చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరులు

ఉప్పల్, జూన్ 16 ప్రభాతవార్త : వచ్చే వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థల నిర్వహణ, విద్యుత్ సరఫరా, పారిశుధ్య తదితర అంశాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీమతి రాధికా గుప్తా ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో జోనల్ స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, ట్రాఫిక్ పోలీస్, హైడ్రా, విద్యుత్, జలమండలి,పోలీసు, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ రాధిక గుప్తా మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా నీరు నిలిచే ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణ, విద్యుత్ సరఫరా, తాగునీటి సేవలు, పారిశుధ్య చర్యలు మరియు ట్రాఫిక్ నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలం ముగిసే వరకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు నిరంతర సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

రామంతాపూర్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరులు

రామంతాపూర్, జూన్ 16 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని వెంకట్ రెడ్డి నగర్ మరియు బీరప్పగడ్డ తదితర ప్రాంతాలలో ప్రతిపాదిత అభివృద్ధి పనులను మంగళవారం జోనల్ కమిషనర్ రాధిక గుప్తా అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజినీర్ హరి కిషోర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెన్నెలగౌడ్, ఎఇ రాజ్‌కుమార్, శ్వేతశ్రీ తదితరులతో కలిసి ఆయా ప్రాంతాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల అవసరాలను పరిశీలించారు. స్థానిక ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

మలక్ పేట్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వీరు జాదవ్

మలక్ పేట, జూన్ 16, ప్రభాతవార్త:
మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గా డాక్టర్ వీరు జాదవ్ పదవి బాధ్యతలు చేపట్టారు. మెదక్ నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వీరు జాదవ్ బదిలీపై మలక్ పేట్ ఏరియా ఆసుపత్రికి రావడం జరిగింది. మలక్ పేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వీరు జాదవ్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తామని పేర్కొన్నారు. ఏరియా ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

మంజూరైన అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలి : చింతల

వనస్థలిపురం జూన్.16.ప్రభాతవార్త.
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని చింతలకుంట - వనస్థలిపురం డివిజన్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఎఫ్‌సీఐ కాలనీ జీమెట్ నుండి ఆర్టీసీ కాలనీ హనుమాన్ టెంపుల్ వరకు, అలాగే హనుమాన్ టెంపుల్ నుండి జంగీర్‌నగర్ కాలనీ మసీదు వరకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులు నాలుగు నెలలు గడిచినా ప్రారంభం కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వనస్థలిపురం డివిజన్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ చింతల రవికుమార్ ఆధ్వర్యంలో, ఆర్టీసీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ముకుందరాజుతో కలిసి స్థానిక ప్రజల తరఫున ఎంఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్వావికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో నాలుగు నెలల క్రితం శంకుస్థాపన జరిగినప్పటికీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రోడ్లు అధ్వాన్నంగా మారి పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లపై ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళి కారణంగా

డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చింతల.

ప్రజలు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో బురద, నీటి నిల్వలు ఏర్పడి ప్రజలకు మరింత ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని, కాబట్టి మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ కమిషనర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి కృషి : రజితరెడ్డి

ఉప్పల్, జూన్ 16 ప్రభాతవార్త :
సీనియర్ సిటిజన్స్ సంక్షేమం, అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తున్నామని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ గోల్డెన్ బర్డ్స్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం. పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ సీనియర్ సిటిజన్స్ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఉప్పల్‌లో ఉన్న సీనియర్ సిటిజన్స్ కోసం స్థలాన్ని కేటాయించడంతో పాటు భవనాన్ని సైతం నిర్మాణం చేసి ఇచ్చినట్లు తెలిపారు. రానున్న కాలంలో సీనియర్ సిటిజన్స్ కోసం పని చేసేందుకు, అన్ని వేళల్లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ గోల్డెన్ బర్డ్స్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్, ఉపాధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, మనోహర్, సంయుక్త కార్యదర్శులు నరసింహారెడ్డి, లింగారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్యూరిటీలు విజయరావు, సల్ల మల్లారెడ్డి, సలహాదారులు మేకల వెంకట్‌రెడ్డి, శామీర్‌పేట యాదిరెడ్డి, ధర్మారెడ్డి, గోనె ప్రభాకర్ రెడ్డి, గోనె అర్జున్ రెడ్డి, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ రావు, మెంబర్లు మందుముల అంజి రెడ్డి, లక్ష్మీ నరసయ్య, పాండు రంగయ్య, వీరేశం, కుమార స్వామి, రామయ్య గౌడ్, ఐలయ్య, స్నేహ, కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి, భిక్షపతి, రఘురామయ్య, నారాయణ, పాపిరెడ్డి, సత్యనారాయణ , రాంరెడ్డి, వెంకటేశ్వరి, వెంకటమ్మ, సుశీల, సంధ్య రేఖ, శ్రీవాణి, ఇందిరా, స్వరూపారాణి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో జరిగిన సీనియర్ సిటిజన్స్ సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఇంటర్ విద్య విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుంది : ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

హయత్ నగర్, జూన్ 16 ప్రభాతవార్త :
ఇంటర్మీడియట్ విద్య విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ఇందులో కనబరిచే ప్రతిభ వారి భావి జీవితానికి పునాది వేస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యు కేషన్స్ ఛైర్మన్ మల్క కొమరయ్య అన్నారు. ఇంటర్మీడియట్ 2026 ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం కుంట్లూరులోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో ఖితెలంగాణ పీపుల్స్ వాయిస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026 ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఖిథింక్ బిగ్.. వర్క్ హార్డ్.. గెట్ సక్సెస్‌ఖి అనే నినాదంతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం విద్య, సాంకేతిక, రక్షణ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. విద్యార్థులు ప్రపంచ స్థాయి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత వై. వెంకటేశ్వర్ రావు, మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ళ రాఘవేంద్ర, విద్యారంగ విద్యార్థులు నిపుణులు ప్రభాకర్ రావు, ఉద్యానశాఖాధికారి మంగ మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుని సమాజానికి

పురస్కారలు అందుకున్న విద్యార్థులతో కొమరయ్య

ఆదర్శంగా నిలవాలన్నారు. నిరంతర శ్రమతోనే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. చాటింగ్‌లు, డేటింగ్‌లు, సోషల్ మీడియాపై సమయాన్ని వృథా చేయకుండా కెరీర్ వైపు అడుగులు వేయాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషిని ఎప్పటికీ మరవకూడదని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షలలో అసాధారణ ప్రతిభను కనబరిచిన 300 మంది విద్యార్థులకు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో పీఈసీ కాలేజీ డైరెక్టర్, ప్రిన్సిపాల్, కళాశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరిలో అక్రమ హుక్కా సెంటర్లపై ఉక్కుపాదం

-14 కేంద్రాల తనిఖీ.. 4 కేసులు నమోదు, 7 మంది అరెస్ట్

నేరేడ్ మెట్,మల్కాజ్‌గిరి కమిషనరేట్ , జూన్ 16,ప్రభాతవార్త :
నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అక్రమ హుక్కా సెంటర్లపై మల్కాజ్‌గిరి పోలీసు కమిషనరేట్ ప్రత్యేక ఆపరేషన్ బృందం (ఎస్ఓటీ) విస్తృత తనిఖీలు చేపట్టింది. విశ్వసనీయ సమాచారం మేరకు కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించి అక్రమ కార్యకలాపాలను వెలికితీసింది.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మొత్తం 14 హుక్కా సెంటర్లు, కేఫ్‌లను పరిశీలించిన పోలీసులు నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న నాలుగు సంస్థలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని చట్టపరమైన చర్యలు ప్రారంభించారు.నిబంధనలు తప్పనిసరిప్రజారోగ్యం, భద్రతా ప్రమాణాలను విస్మరించి కేఫ్‌ల ముసుగులో హుక్కా సెంటర్లను నిర్వహించడాన్ని మల్కాజ్‌గిరి పోలీసు కమిషనరేట్ తీవ్రంగా పరిగణించింది. సంబంధిత శాఖల అనుమతులు, లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. హుక్కా సెంటర్లు, కేఫ్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని హెచ్చరించింది.కఠిన చర్యలు తప్పవుఅనుమతులు లేకుండా హుక్కా కేంద్రాలను నిర్వహించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సంబంధిత సామగ్రిని స్వాధీనం చేసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో ఇలాంటి తనిఖీలు, ఆకస్మిక దాడులు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.ప్రజల సహకారం కోరిన పోలీసులు స్థానికంగా ఎక్కడైనా అక్రమ హుక్కా సెంటర్లు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతో అక్రమ కార్యకలాపాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు.మల్కాజ్‌గిరి పోలీసు కమిషనర్ బి. సుమతి ప్రత్యక్ష పర్యవేక్షణలో, రోడ్ సేఫ్టీ ఇన్‌ఛార్జి ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్ మార్గదర్శకత్వంలో ఈ ప్రత్యేక దాడులు నిర్వహించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి

బస్తీలో పర్యటిస్తున్న తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి,జూన్ 16 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రగతి కాలనీ,టాటానగర్‌లో మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. స్థానిక బస్తీ వాసులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బస్తీలలో డ్రైనేజీ వ్యవస్థ పైప్‌లైన్,కొత్త సిసి రోడ్డు పనులు త్వరలో ప్రారంభం అవుతాయని తెలిపారు.ప్రజల సమస్యలను పరిష్కరించటానికి నిరంతరం కృషి చేస్తున్నానని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు పాండు యాదవ్,సీనియర్ బిజెపి నాయకులు సంతుగౌడ్, దయానంద్, సాయిలు, నరేష్, శారద, విశ్వనాద్, ఏ.రమేష్, కాలిదాస్, కొండప్ప, అర్జున్, రమేష్ యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

అత్తాపూర్ జూన్ 16, ప్రభాతవార్త :

ప్రేమావతి పేట్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్కొండ శ్రీనివాస్ జ్ఞాపకార్థం వారి కుమారుడు గోల్కొండ శేకర్ కుటుంబసభ్యులతో కలిసి విద్యార్థులకు నోట్ బుక్స్ , పలకలు, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మునీరా బేగం,టీచర్స్ డి. సరితా,రేణుక దేవి,గోల్కొండ రాజు కుమార్,పోయిల జీవన్ దాస్,ఎడ్లకాడి సూర్యం,ఉపేందర్,చంద్ర శేకర్,సుమన్, సన్నీ,గౌతమ్, సుమిత్ర, సునంద,అపర్ణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

: జాయింట్ కలెక్టర్ ఏపూరి భాస్కర్ రావు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ భాస్కర్‌రావు

ఉప్పల్, జూన్ 16 ప్రభాతవార్త :
యువత క్రీడల్లో రాణించి భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చాటాలని యాదాద్రి భువనగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఏపూరి భాస్కర్ రావు మేరు పేర్కొన్నారు.ఈ మేరకు మంగళవారం తెలంగాణ మేరు యువత ఆధ్వర్యంలో రైల్వే మల్టీ పర్పస్ స్టేడియంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిఎజులుగా జాయింట్ కలెక్టర్ ఏపూరి భాస్కర్ రావు మేరు, తెలంగాణ మేరు కార్పొరేషన్ చైర్మన్ సంఘ వెంకట్రాజం మేరు, వైస్ చైర్మన్ మాడిశెట్టి లక్ష్మీనారాయణ మేరు , తెలంగాణ మేరు ట్రస్ట్ చైర్మన్ పొడిశెట్టి నర్సింగ్ రావు మేరు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ కీర్తి వేణుగోపాల్, రాష్ట్ర మేరు సంఘం మాజీ అధ్యక్షులు పెండ్యాల చంద్రమోహన్ మేరు, కొండ మోహన్ మేరు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావడానికి ఇటువంటి టోర్నమెంట్లు దోహదపడతాయని అన్నారు. టోర్నమెంట్ నిర్వహణలో పెండ్యాల గిరిధర్ మేరు, గుడ్డేటి అరుణ్ మేరు, కోవూరు చంద్రకాంత్ మేరు, రాపర్తి సాయినాదజ్ మేరు, కొత్తపల్లి రమేష్ మేరు కీలక పాత్ర పోషించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు మాడిశెట్టి శ్రీనివాస్ మేరు, ఓదెల సత్యనారాయణ మేరు, మునిగాలా దీన్ దయాల్ మేరు, మాడిశెట్టి నవీన్ మేరు, రుద్రాంగి కరుణాకర్ మేరు తదితరులు పాల్గొన్నారు.

పేదలపాలిటి వరం సిఎం సహాయ నిధి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం జూన్.16. ప్రభాతవార్త.
సీ.ఎంరిలీఫ్ ఫండ్‌తో పేదలకు అండగా నిలుస్తున్నామని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిపేర్కొన్నారు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శారదా నగర్ నందు నివాసం ఉంటున్న కృష్ణకుమారి కిడ్నీలకు సంబంధించి పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో వారి కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వారి వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం సిఎం సహాయనిధి ద్వారా దరఖాస్తు చేయించారు. దీనికి సంబంధించి రెండు లక్షల రూపాయల ఎల్.ఓ.సీ మంజూరు కాగా బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా మాకు ఎంతో సంతృప్తి లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు బోశెట్టి.భాస్కర్ సాగర్,సురేష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్.ఓ.సి.పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

వెంకట్‌రెడ్డినగర్‌లో నీటి సమస్య పరిష్కారం : ఆకారపు అరుణ్

వెంకట్‌రెడ్డినగర్‌లో మంచి నీటి సమస్య పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత ఆకారపు అరుణ్ తదితరులు

రామంతాపూర్,జూన్ 16 ప్రభాతవార్త : రామంతాపూర్ ఈస్ట్ శ్రీనివాసపురం, మధురానగర్, రాంశంకర్‌నగర్‌లలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, మంచి నీటి సమస్య పరిష్కరించినట్లు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వెంకట్‌రెడ్డినగర్‌లో పలువురు కాలనీవాసులతో కలిసి పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో పనులు చేపడుతున్నామని తెలిపారు. గత 45 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఓపెన్ నాలా పనుల వల్ల స్థానిక ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, చిరు వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ మరియు తాగునీటి పైపులైన్ సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. దీంతో వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి నాలా పనులను పూర్తి చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ శ్వేత, జలమండలి మేనేజర్ రవీందర్, కాలనీ నేతలు రంజిత్ రెడ్డి చోటా పరశురాం, రాజేశ్వరరావు, యాదగిరి రెడ్డి, ఈశ్వర్ గౌడ్, రమేష్ యాదవ్, గిరీష్, కృష్ణ గౌడ్, నాయబ్ రాజేష్, రాజ్ జలంధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లావణ్య కుమార్, లక్కన్, నరేందర్ రెడ్డి, రోహిత్, సత్యనారాయణ, ఆనంద్ దేశ్‌పాండే, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండ : రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్, జూన్ 16 ప్రభాతవార్త:
సిఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డాక్టర్స్ కాలనీకి చెందిన మహిళా కాంగ్రెస్ నాయకురాలు శివలీల భర్త వెంకటేష్ గత కొంత కాలంగా వెన్నెముక సంబంధిత అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. వెంకటేష్ ఆర్థిక పరిస్థితి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవడానికి సహకరించకపోవడంతో అతని భార్య శివలీల తన భర్తకు చికిత్స చేయించడానికి సహకరించాలని రాజశేఖరెడ్డిని కోరడంతో ఆయన వెంటనే స్పందించి వారి చేత సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ నేపథ్యంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుండి మంజూరైన రూ.3లక్షల ఎల్ఓసి లెటర్‌ను వెంకటేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

ఎల్ఓసి లెటర్‌ను అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

విద్యాలయాల్లో ప్రోటోకాల్‌ను పాటించాలి : సీతారాం ధూళిపాళ

నార్సింగి, జూన్ 16 ప్రభాతవార్త :
మణికొండలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న కార్యక్రమాల సమయంలో సంబంధిత శాఖ అధికారులు ప్రోటోకాల్‌ను పాటించాలని బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. మంగళవారం గండిపేట మండలంలోని మణికొండలో విద్యాశాఖ అధికారుల తీరు పట్ల బిఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ ఇటీవల మణికొండలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అన్ని అధికారిక కార్యక్రమాలలో ఉపాధ్యాయులు ప్రోటోకాల్‌ను పాటించడం లేదని ఆరోపించ